క్లుప్తంగా

నేటి నుంచి అచ్యుతాపురంలో భూ రీ సర్వే

గోకవరం: అచ్యుతాపురం గ్రామంలో బుధవారం నుంచి జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకంలో భాగంగా రీ సర్వే నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని రైతులు ఆధార్, పాస్‌పుస్తకం, దస్తావేజులు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లు రెండు సెట్లతో భూ సర్వే టీం సభ్యులకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉదయం 10.30 గంటలకు గ్రామసభ జరుగుతుందని రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని సందేహాలను నివృతి చేసుకోవాలన్నారు.

రక్తదానం


తుని బ్లడ్ బ్యాంకు రక్తం ఇస్తున్న దాడిశెట్టి శ్రీనివాస్

తుని: ప్రైవేటు ఆసుపత్రిలో అత్యవసర చికిత్స కోసం రక్తం అవసరమని చెప్పిన వెంటనే దాడిశెట్టి నరసయ్య చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ దాడిశెట్టి శ్రీనివాస్ స్పందించారు. ఆయనే నేరుగా మదర్ బ్లడ్ బ్యాంకు వచ్చి రక్తం ఇచ్చి మానవత్వం చాటుకున్నారు. మంగళవారం తుని పాండురంగా ప్రజా వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ పేద మహిళకు రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీనివాస్ నేరుకు ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. భవిష్యత్‌లో పేదలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని శ్రీనివాస్ అన్నారు.

16న జాబ్‌మేళా

ఏలేశ్వరం: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన పట్టణంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా అధికారి డి.హరిశేషు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో 11 కంపెనీలకు చెందిన సుమారు 500 ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమో, ఐటీఐ తదితర కోర్సులకు చెందిన అభ్యర్థులు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9010737998, 8247788247 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న 144 సెక్షన్

గోకవరం: తిరుమలాయపాలెం గ్రామంలో పోలీసులు విధించిన 144 సెక్షన్ కొనసాగుతుంది. గ్రామంలో ఓ వర్గం సభ్యులు అనుమతులు లేకుండా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయడంతో పోలీసులు విగ్రహాన్ని తొలగించారు. ఈ క్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో 144 సెక్షన్ అమలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోకి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

దివ్యాంగులను అన్ని విధాలా ఆదుకుందాం

జగ్గంపేట: దివ్యాంగులను గుర్తించి వారిని అన్ని విధాలా ఆదుకునేందుకు కృషి చేద్దామని కాకినాడ ఉమా ఎడ్యుకేషన్ టెక్నికల్ సొసైటీ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్పీ రెడ్డి అన్నారు. మంగళవారం రాజపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గౌతమి ఆధ్వర్యంలో వినికిడి, అంధత్వం, బహుళ వైకల్యం కలిగిన వారిని గుర్తించేందుకు వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసిన శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా అంగవైకల్యం కలిగిన వారికి సహకారం అందిస్తామన్నారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఈ శిక్షణ తర్వాత అంగవైకల్యం ఉన్న వారిని గుర్తించాలన్నారు. వారికి సాయం చేయడమే మా సంస్థ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్ బూసాల విష్ణు మూర్తి, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ టి.హరి బాబు, ట్రైనింగ్ ఆఫీసర్ పి.శ్రీనివాస్, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో నిధులు కేటాయింపు


ఎంపీడీఓ పద్మాజ్యోతిని సత్కరిస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, ఎంపీటీసీలు తదితరులు

గోకవరం: మండలంలో అన్ని ఎంపీటీసీల పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయిస్తామని ఎంపీపీ సుంకర శ్రీవల్లి అన్నారు. ఎంపీడీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె.పద్మజ్యోతిని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ ఆధ్వర్యంలో పలువురు ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అన్ని ఎంపీటీసీల పరిధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు ప్రాధాన్యతా క్రమంలో మండల పరిషత్ నిధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్సయ్య, ఎంపీటీసీలు తోలేటి రమ్యశ్రీ, నరాలశెట్టి గౌతమి, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు ముమ్మరం

- పెరగనున్న భూ సారం
- తెగుళ్ల నివారణకు మార్గం
- పనుల్లో నిమగ్నమైన రైతులు


ఒమ్మంగిలో ట్రాక్టర్‌తో పొలాన్ని దున్నుతున్న రైతు

ప్రత్తిపాడు రూరల్: వేసవి దుక్కులు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పొలాలను దుక్కి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కులు చేయడం వల్ల భూమి సారవంతంగా మారి పంట దిగుబడి బాగుంటుంది. వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమేణ ఆ భూములు నిస్సారంగా మారి పంటల దిగుబడి తగ్గడంతోపాటు తెగుళ్ల వ్యాపిస్తాయి. వాటిని నివారించేందుకు దుక్కులు చేయడం మంచిది. ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన రైతులు వేసవిలో దుక్కులు చేసుకోవాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

అనువుగా పొలాలు

ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను సాగు చేసే పొలాల్లో వేసవి దుక్కులు చేయడం ఎంతో లాభదాయకం. రైతులు వేసవి దుక్కులు చాలా వరకూ మానేశారు. మండలంలోని పోతులూరు, ధర్మవరం, వాకపల్లి, శరభవరం, గజ్జనపూడి, ఒమ్మంగి, చింతలూరు, ఉత్తరకంచి తదితర గ్రామాల్లో వేసవి దుక్కులు ఊపందుకున్నాయి. మండలంలో 15,577 ఎకరాల్లో సాగు భూమి ఉంది. ఇందులో 10,500 ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో ప్రత్తి, 925 ఎకరాల్లో మినుములు, 105 ఎకరాల్లో పెసలు, 2,547 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేసే అవకాశం ఉన్నట్టు మండల వ్యవసాయ అధికారి వై.గంగాధర్ తెలిపారు.

ప్రయోజనాలు

వేసవిలో పొలాలను దుక్కు చేయడం వల్ల గడ్డి నశించిపోవడంతోపాటు వరిమోళ్లు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువుగా మారతాయి. భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వల్ల వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని తదుపరి సాగు చేసే పంటకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి. పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది. తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఎండలకు చనిపోడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు. దీంతో పెట్టుబడి కూడా తగ్గుతుంది. రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని మరింత పెంపొందించుకోవచ్చు.

భూమి సారవంతం



పంట పొలాల్లో విరామం లేకుండా పంటలు పండిస్తుంటే భూ సారం తగ్గుతుంది. ఈ సమస్యను నివారించేందుకు పొలాల్లో వేసవి దుక్కులు చేస్తారు. రబీ తరువాత అపరాలు సాగు చేసే భూముల్లో కాకుండా ఖాళీ పొలాల్లో దుక్కులు చేపట్టడం వల్ల చెడు పురుగులు, శిలింద్రాలు చనిపోతాయి. గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. ఈ విధంగా చేసిన పొలాల్లో తెగుళ్ల బెడద తక్కువ. తద్వారా దిగుబడి పెరుగుతుంది.

– వై.గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పెద్దపీట


టీజే నగరంలో జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ రాంబాబు తదితరులు


వి.కొత్తూరు కేజీబీవీలో విద్యార్థినులకు పాఠ్య పుస్తకాలు అందిస్తున్న పోతల రమణ

కోటనందూరు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని సర్పంచ్ సుర్ల రాంబాబు అన్నారు. మంగళవారం టీజే నగరం ఎంపీయూపీ పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని చక్కగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యాబోధనలో ఉపాధ్యాయులు అంకితభావంతో వ్యవహరించాలన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గిడుతూరి రాంబాబు, సుర్ల శ్రీనివాసు, సుర్ల నాగేశ్వరరావు, సుర్ల నాగరమణ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు విద్యే ఆస్తి

తుని రూరల్: పేదలకు విద్యే తరగని ఆస్తి అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతల రమణ అన్నారు. మంగళవారం వి.కొత్తూరు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ప్రిన్సిపాల్ అమృతవాణి అధ్యక్షతన జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోతల రమణ పాల్గొన్నారు. ఆరు నుంచి పది తరగతులు చదువుతున్న విద్యార్థినులకు పాఠ్య, రాత పుస్తకాలు, జగనన్న విద్యా కానుకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రగాఢ విశ్వాసమన్నారు. దాంతో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకున్న ఉన్నతంగా ఎదగాలన్నారు. నాయకుడు దుంగల నాగేశ్వరరావు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆ ప్రచారంలో వాస్తవం లేదు


విలేకరులతో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ జిగిరెడ్డి రమణమ్మ, ఆమె భర్త శ్రీను

రౌతులపూడి: తనకు పార్టీలో అధికారకంగా ప్రొటోకాల్ ఇవ్వడం లేదంటూ, రాజకీయంగా వేధిస్తున్నారంటూ కొన్ని సామాజిక మాధ్యమాల్లో రౌతులపూడి ఎంపీపీ చేసిన ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ జిగిరెడ్డి రమణమ్మ, ఆమె భర్త వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను అన్నారు. మంగళవారం వారు పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలసి మండల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గత నాలుగేళ్లుగా ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ములగపూడి పీహెచ్‌సీ, మహిళా జూనియర్ కళాశాల ఏర్పాటు వంటివి చేయడంతో చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేస్తున్నారన్నారు. కొంతమంది సూచనలతో తనను, తన భర్త శ్రీనును అప్రతిష్ట పాలు చేయడానికి తప్పడు ప్రచారాలు చేస్తున్నారని వారిద్దరూ వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, పార్టీ నాయకులు సైపురెడ్డి వెంకటరమణ, సోమరౌతు నాని తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో కలెక్టర్ విస్తృత పర్యటన


సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

సామర్లకోట: కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం పట్టణంలో విస్తృత పర్యటన నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలకు మంజూరు అయిన నిధులు, ఆ నిధులతో చేస్తున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలలు తెరిచే సమయానికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఎందుకు పూర్తి చేయలేదని పాఠశాల హెచ్‌ఎంను ప్రశ్నించారు. పాఠశాలకు వచ్చిన జగనన్న విద్యా కానుక కిట్లు, గోరు ముద్ద అమలు వంటి వాటిపై సమాచారం సేకరించారు. అసంపూర్తిగా ఉన్న పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని స్త్రీ, పురుషుల వార్డులు, మాతాశిశు వార్డులను పరిశీలించారు. కలెక్టర్ కృతికా శుక్లా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నామన్నారు. రోగులు సంతృప్తి వ్యక్తం చేశారని, 24 గంటలూ సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని రోగులు చెప్పారన్నారు. శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. డీఈఓ కె.అన్నపూర్ణ, డిప్యూటీ డీఈఓ డానియల్ రాజు, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, డీసీహెచ్ఓ డాక్టరు పీబీ విష్ణువర్ధని, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, ఉపాధ్యాయులు, డాక్టర్లు పాల్గొన్నారు.

గాలివాన బీభత్సం


గిడజాంలో ఆర్‌అండ్‌బీ రహదారిపై కూలిన మర్రిచెట్టు


తొండంగిలో రహదారిపై విరిగి పడిన వృక్షం

రౌతులపూడి: గాలివాన బీభత్సం సృష్టించాయి. మంగళవారం ఉదయం నుంచి ఎండలతో మండిపోయి సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి ఈదురు గాలులతో వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు నీట మునిగాయి. గిడజాంలో దశాబ్దాల నాటి మర్రిచెట్టు కూలి ఆర్‌అండ్‌బీ రహదారిపై పడింది. దీంతో రౌతులపూడి–తుని మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పారుపాకలో విద్యుత్‌స్తంభం నేలకూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మండలంలోని రౌతులపూడి, ఎస్.పైడిపాల, గుమ్మరేగుల, ఎ.మల్లవరం, బలరామపురం, లచ్చిరెడ్డిపాలెం, పారుపాక, ఎస్.అగ్రహారం తదితర గ్రామాల్లో గాలివాన బీభత్సం చేసింది. పలు గ్రామాల్లో మామిడి, జీడి మామిడి చెట్లు, అరటి వంటి తోటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా సమాచారం.

ఈదురు గాలులకు విరిగిన చెట్టు

తొండంగి: స్థానిక మెయిన్ రోడ్డు కార్పొరేషన్ బ్యాంకు సమీపంలో ఈదురు గాలుల ప్రభావానికి చెట్టు విరిగి రోడ్డుపై అడ్డంగా పడడంతో భారీ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తొండంగి నుంచి అన్నవరం వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన ఉన్న చెట్టు ఈదురు గాలులకు విరిగి రోడ్డుపై పడింది. విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికులు చెట్టును తొలగించే ప్రయత్నం చేశారు. రాకపోకలకు మార్గం సుగమం అయింది. ఆర్‌అండ్‌బీ అధికారులు విరిగిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే సీజ్ చేస్తాం

కొత్తపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్ చేస్తామని సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు అన్నారు. ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని తెలిపారు.ముఖ్యంగా తీర ప్రాంతంలో పర్యాటకులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన


విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విత్తన శుద్ధిపై ప్రతీ రైతుకు అవగాహన అవసరమని రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ బత్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వీఏఏల అధ్యక్షతన మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది 150 మంది రైతులను డిజిటల్ ఫామ్ స్కూల్‌ను ఏర్పాటు చేసి పలు వ్యవసాయ పద్ధతులపై సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కేజీ విత్తనానికి ఎనిమిది గ్రాముల సుడోమోనస్ కలిపి 24 గంటల తరువాత పొలంలో వెదజల్లుకోవచ్చన్నారు. రైతులు విత్తనశుద్ధి చేయడం ద్వారా వరి పంటలో తొలిదశలో ఆశించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. రైతులు తమ పంట పొలాలు, పశువులు, వాతావరణం గురించి సమాచారం తెలుసుకోవాలంటే రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నంబర్ 180041 98800కి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటలలోపు తెలుసుకోవచ్చని నాగేశ్వరరావు సూచించారు. వీఏఏలు స్రవంతి, అమృత, విజయదుర్గ, రైతులు నల్లల గోవిందు, మూర్తి, చక్రధరరావు, సుబ్రహ్మణ్యం, రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఏలేరు కాలువలో తగ్గిన నీటి నిల్వలు


నీటినిల్వలు అడుగంటిన ఏలేరు కాలువ

ఏలేశ్వరం: వేసవి ఎండలకు ఏలేరు కాలువలో నీటి సరఫరా తగ్గుముఖం పట్టింది. దీంతో కాలువపై ఆధారపడిన మూగజీవాలకు తాగునీరు లేక నానాపాట్లు పడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువలో నీరే ఆయా గ్రామాల పశువులకు ఆధారం. వేసవిలో సాయంత్రమైతే కాలువలో వీటిని శుభ్రం చేసి తాగు నీటి అవసరం తీర్చుతుంటారు. ప్రస్తుతం ఏలేరు జలాశయంలో నీటినిల్వలు తగ్గుముఖం పట్టడంతో కాలువలో నీటి సరాఫరా తగ్గిపోయింది. దీంతో తాగు నీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలు నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బడుగు బలహీన వర్గాల్లో మార్పు రావాలి

శంఖవరం: బడుగు బలహీన వర్గాల్లో మార్పు వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతామని బీసీ నేత, పారిశ్రామికవేత్త బోడే రామచంద్ర యాదవ్ అన్నారు. మంగళవారం సీతయమ్మపేటలో బీసీ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు అందరూ ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం కోసం కృషి చేయాలన్నారు.

కెనాల్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

సామర్లకోట: కాకినాడ కెనాల్ రోడ్డులో వీకే రాయపురం నుంచి మాధవపట్నం వెళ్లే రోడ్డులో సర్పవరం రైల్వే జంక్షన్ సమీపంలో గుర్తు తెలియని మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. 40–45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ముఖం నల్లగా కమిలిపోయి ఉందన్నారు. మృతుడు నీలం గళ్ల కలిగిన షర్టు, బిస్కెట్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. కుడి చేతికి రింగ్ ధరించే వేలు లేదని, మధ్య వేలికి వెండి ఉంగరం ఉందన్నారు. పోలియో కారణంగా పడిపోయి, చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్ దర్యాప్తు చేస్తున్నారు.

భూ రీసర్వే పనులు వేగవంతం చేయండి


రీసర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూరీసర్వే పనులు వేగవంతం చేయాలని వీఆర్వోలు, సర్వేర్లకు పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు ఆదేశించారు. మంగళవారం నెల్లిపూడి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ వంద సంవత్సరాల తరువాత రీ సర్వే చేస్తున్నామన్నారు. రీ సర్వేతో భూ తగదాలు శాశ్వత పరిష్కారమవుతాయన్నారు. ఇప్పటికే మొదటి దశగా కొన్ని గ్రామాలు రీ సర్వే పూర్తి చేశామన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షికోత్సవం

శంఖవరం: గ్రామంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ 12వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరింగి. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయంలో భజన బృందాలు భజనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. అలాగే మండపంలో నూతనంగా నిర్మించిన ఉమా రామలింగేశ్వస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి లోవరాజు, బొర్రా శ్రీను, కనిగిరి బాబ్జి, వెలుగుల రాంబాబు, జట్లా లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు 'కోట' విద్యార్థి

సామర్లకోట: అంతర్జాతీయ యోగా పోటీలకు సామర్లకోట బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపిక అయ్యాడు. ఈ మేరకు ఆ పాఠశాల హెచ్‌ఎం, పీఈటీలు మంగళవారం విలేకర్లకు తెలిపారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 8వ తరగతి పూర్తి చేసుకున్న కిల్లాడి యశ్వంత్ తండ్రి వద్ద యోగా శిక్షణ పొందాడు. ఈ మేరకు ఇటీవల ఒడిశాలోని కటక్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మొదటి స్థానాన్ని సాధించినట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, పీఈటీ తాళ్లూరి వైకుంఠం తెలిపారు. ఈ మేరకు సెప్టెంబర్ నెలలో థాయిలాండ్ జరిగే అంతర్జాతీయ యోగా పోటీలకు యశ్వంత్ ఎంపిక అయినట్టు వారు తెలిపారు.

మరిడమ్మకు ఆయుష్ హోమం

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో మంగళవారం ఆయుష్ హోమం, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మజీ, ఈఓ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పాటు చండీహోమం, ఆయుష్ హోమం, అభిషేకాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎమ్మెల్యే చిన రాజప్ప, జనసేన ఇన్‌చార్జి తుమ్మలబాబు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు సత్యదేవుని దర్శించనున్న పవన్‌కల్యాణ్


రత్నగిరికి చేరుకున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

అన్నవరం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేసి 'వారాహి' యాత్ర ప్రారంభిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. పవన్‌కల్యాణ్ మంగళవారం రాత్రి రత్నగిరికి చేరుకున్నారు. సత్యగిరిపై ఉన్న పల్లవి అతిథి గృహంలో బస చేశారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు రత్నగిరి నుంచి పవన్‌కల్యాణ్ బయలుదేరి కత్తిపూడి వెళతారు. అక్కడ సాయంత్రం నాలుగు గంటలకు బహిరంగ సభ ఉంటుందని ఆ పార్టీ నాయకులు తెలిపారు.



నిర్మానుష్యంగా ఏలేశ్వరంలో యర్రవరంరోడ్డు (అంతరచిత్రం) రాచపల్లి అడ్డురోడ్డు వద్ద చీర చెంగును ఎండకు రక్షణగా ఉంచిన మహిళ

ఏలేశ్వరం/ప్రత్తిపాడు రూరల్: మృగశిర కార్తెలోనూ ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. భానుడు తన ప్రతాపం చూపడంతో వేడికి ప్రజలు అల్లాడుతున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం ఎండలు 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రమైనా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండలకు మూగజీవాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే హనుమాన్ జంక్షన్, లింగంపర్తిరోడ్డు, యర్రవరంరోడ్డు, నర్సీపట్నంరోడ్డు జనం లేక వెలవెలబోయాయి. ప్రత్తిపాడులో ప్రధాన రహదారులు, కూడళ్ల నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. సాయంత్రం ఒక్కసారిగా చల్లటి గాలులు వీచి వాతావరణం చల్లబడింది. చిరు జల్లులు పడ్డాయి.